న్యాయవాది వెంకటేశ్వర్లుకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నివాళి

చివ్వెంల: వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల, మార్చి 6: ప్రముఖ న్యాయవాది జటంగి వెంకటేశ్వర్లు మృతి బాధాకరమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను జగదీశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అనంతరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. వెంకటేశ్వర్లు న్యాయవాదిగా, గ్రామ సర్పంచుగా అనేక సేవలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో న్యాయవాది డపుకు మల్లయ్య, సూర్యాపేట మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు రావిచెట్టు సత్యం, గొడ్డేటి సైదులు పాల్గొన్నారు.

లింగమంతుల స్వామి పండుగ ఏర్పాట్ల పరిశీలన..

నాగారం: మండల కేంద్రంలో ఈ నెల 23, 24 తేదీల్లో జరుగనున్న లింగమంతుల స్వామి పండుగ సందర్భంగా యాదవ కుల పెద్దల ఆహ్వానం మేరకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి గురువారం రాత్రి లింగమంతులస్వామి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించి అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చారు.

నాయకుల జన్మదిన వేడుకల్లో..

సూర్యాపేట టౌన్/హుజూర్‌నగర్ రూరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హుజూర్‌నగర్ మండలంలోని అమరవరం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి జన్మదిన వేడుకలను సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జగదీశ్‌రెడ్డి సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

లక్ష్మయ్యకు మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ నివాళి

లక్ష్మయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

చిలుకూరు, మార్చి 6: సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు కొడారు లక్ష్మయ్య మరణం బాధాకరమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రం చిలుకూరులో ఇటీవల మరణించిన కొడారు లక్ష్మయ్య కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు అల్సకాని జనార్దన్, తాళ్లూరి శ్రీను, జానిమియా, మాధవరపు శ్రీను, లింగరాజు, పాషా, ఉపేందర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యుటేషన్ సరికాదు : ఏఐవైఎఫ్

గరిడేపల్లి, మార్చి 6: మండలంలోని గానుగబండ ప్రాథమిక పాఠశాల టీచర్లను డిప్యుటేషన్ల పేరుతో ఇతర పాఠశాలలకు పంపించడం సరికాదని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పంగ సైదులు, లింగరాజు అన్నారు. గురువారం వారు పాఠశాలను సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులను మరో పాఠశాలకు పంపితే ఇక్కడి విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిప్యుటేషన్‌పై పంపిన ఉపాధ్యాయులను తిరిగి గానుగబండ పాఠశాలకు పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మస్తాన్ అలీ, నందిపాటి సతీశ్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ చత్రునాయక్ వివరణ..

గానుగబండ ప్రాథమిక పాఠశాలలో 36 మంది విద్యార్థులకు నలుగురు టీచర్లు ఉన్నారు. తాళ్లమల్కాపురం అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయుల కొరత ఉండడంతో ఒక టీచర్‌ను తాత్కాలిక సర్దుబాటుపై పంపించాం.

ఉండ్రుగొండ గుట్టల్లో మంటలు

మంటలను పరిశీలిస్తున్న అటవీ, అగ్నిమాపక శాఖ అధికారులు

చివ్వెంల, మార్చి 6: మండలంలోని ఉండ్రుగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ తూర్పు గుట్టకు సమీపంలోని పెద్దగట్టుపై గురువారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల నుంచి దట్టమైన పొగలు వ్యాప్తి చెంది మంటలుగా మారాయి. అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించడంతో అటవీశాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు గుట్ట ప్రాంతానికి చేరుకున్నారు. కాగా, అగ్నిమాపక వాహనంతో మంటలు అదుపు చేయడానికి గుట్ట ప్రాంతానికి చేరుకున్నప్పటికీ ఏం చేయలేని పరిస్థితి ఉండడంతో వెనుదిరిగామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కిరణ్‌కుమార్, సెక్షన్ అధికారి వెంకటేశ్ తెలిపారు. మంటలు ఆరిన తర్వాత ఈ ఘటనకు గల కారణాలు గుర్తిస్తామని తెలిపారు. మంటలవ్యాప్తి అధికం కావడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కాగా, రాలిన చెట్ల ఆకులపై ఎవరైనా పశువుల కాపరులు బీడీ లేదా చుట్ట తాగి పడేయడంతో మంటలు వ్యాప్తి చెంది ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షల భయంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

నవ్య(ఫైల్)

కోదాడ రూరల్, మార్చి 6 : పరీక్షల భయంతో సూర్యాపేట జిల్లాలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. కోదాడ మండలం కోమరబండ గ్రామానికి చెందిన బచ్చలకూరి శంకర్, ఉమ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు బచ్చలకూరి నవ్య(16) సూర్యాపేట పరిధిలోని అనాజీపురం మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. కొద్దిరోజుల క్రితం టైఫాయిడ్ జ్వరం రావడంతో ఇంటి వద్ద ఉండి వైద్యం చేయించుకుంది. బుధవారం తెలుగు పరీక్ష బాగా రాయలేదంటూ తండ్రి వద్ద నవ్య వాపోగా, పర్వాలేదు.. మిగతావి బాగా రాయమని ధైర్యం చెప్పాడు. పరీక్షలు రాసేందుకు హాస్టల్ వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పిన నవ్య గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శంకర్ ఫిర్యాదు మేరకు కోదాడ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

పేరు మార్పు

నేను అనగా కోలను సత్తిరెడ్డి, తండ్రి: కోలను రాంరెడ్డి, ఇ.నెం.3-44/3, గ్రా॥బ్రాహ్మణపల్లి, మం॥బీబీనగర్, జిల్లా: యాదాద్రి భువనగిరి-508126, నా యొక్క పాస్‌పోర్టు నందు నాపేరు కోలన్ సత్తిరెడ్డిగా ఉంది. ఇకపై అన్ని ప్రయోజనాల కొరకు కోలను సత్తిరెడ్డిగా మార్పు చేయడం జరిగింది.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

పల్లె ప్రకృతి వనం బుగ్గిపాలు

- గుర్తు తెలియని వ్యక్తులు నిప్పపెట్టడంతో కాలిపోయిన మొక్కలు
- రూ.4.60 లక్షలతో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు

అంగోతుతండాలోని పల్లె ప్రకృతి వనంలో కాలిపోయిన మొక్కలు

కొండమల్లేపల్లి, మార్చి 6 : మండలంలోని ఆంగోతు తండా గ్రామ పంచాయతీలో ఉన్న పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికి నిప్పు పెట్టడంతో మంటలు విస్తరించి ఎండి గడ్డితో పాటు 30 గుంటల విస్తీర్ణంలో ఉన్న పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు సైతం కాలిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.4.60 లక్షల వ్యయంతో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. అందులో మొక్కలు నాటి సంరక్షించడంతో ప్రస్తుతం ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అయితే ప్రస్తుతం వాటిని పట్టించుకోక పోవడంతో చెట్ల మధ్యలో గడ్డి పెరిగింది. దాంతో గడ్డికి నిప్పంటుకొని మొక్కలు సైతం కాలిపోయాయి. ఈ విషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు వివరణ కోరగా బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికి నిప్పు పెట్టడం వల్ల మంట రాజుకొని ఆంగోతుతండాలోని పల్లె ప్రకృతి వనం మొక్కలు కాలిపోయినట్లు తెలిపారు. కాలిపోయిన మొక్కల స్థానంలో వేరే వాటిని నాటుతామని, ఉన్న వాటికి రోజు నీళ్లు పెట్టి పచ్చబడే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు.

ఇండియన్ నేవీ అగ్నివీర్‌కు ఉమ్మడి జిల్లా విద్యార్థులు

ప్రదీప్, అభిషేక్

నల్లగొండ మార్చి 6: ఇండియన్ నేవీ అగ్నివీర్‌కు జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. జూలైలో నిర్వహించిన ఇండియన్ నేవీ అగ్నివీర్ సీనియర్ సెంకడరీ రిక్రూట్‌మెంట్ పరీక్షలో జిల్లా కేంద్రంలోని రామయ్య డిఫెన్స్ అకాడమిలో శిక్షణ పొందుతున్న మిర్యాలగూడకు చెందిన ఎన్.అభిషేక్, మునగాలకు చెందిన కె.ప్రదీప్ ప్రతిభ కనబర్చి ఉద్యోగం సాధించారు. అగ్నివీర్‌కు ఎంపికైన విద్యార్థులను గురువారం డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ రామయ్య శ్రీనివాస్, అధ్యాపకులు సన్మానించారు.

ఆర్థిక సాయం

చిట్యాల, మార్చి 6 : గత మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తాను ఇచ్చిన హామీ ప్రకారం తన వార్డుకు సంబంధించిన ఆడబిడ్డ వివాహానికి రూ. 10,016 అందించినట్లు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి తెలిపారు. తాను ఇచ్చిన హామీ మేరకు మేడే శ్వేత వివాహానికి హాజరై ఆమె కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందించినట్లు పేర్కొన్నారు.

రూ.26 లక్షలతో సీసీ రోడ్లు

నందికొండ, మార్చి 6 : నందికొండ మున్సిపాలిటీలోని 1,7,9,12 వార్డుల్లో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన రూ.26 లక్షల నిధులతో సీసీ రోడ్ల పనులను గురువారం ప్రారంభించినట్లు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. సీసీ రోడ్ల పనులను నాణ్యతా ప్రమాణాలు చేపడుతున్నామని, 4 వార్డుల్లో 500 మీటర్ల మేర సీసీ రోడ్డు వేయనున్నట్లు చెప్పారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

మిర్యాలగూడ, మార్చి 6: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లోకేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం వాడపల్లి గ్రామానికి చెందిన గంధం అరుణ్‌కుమార్(26) దామరచర్లలోని పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల ఒకటో తేదీ ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి రెండు రోజులపాటు పెట్రోల్‌బంక్‌లో పనిచేశాడు. తర్వాత ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. గురువారం మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చెట్టుకు ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు రూరల్ పోలీసులకు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

108 అంబులెన్స్ పరిశీలన

నిడమనూరు, మార్చి 6 : మండలానికి ప్రభుత్వం కేటాయించిన 108 అంబులెన్స్ వాహనాన్ని తాసీల్దార్ జంగాల కృష్ణయ్య గురువారం పరిశీలించారు. జీపీఎస్ అనుసంధానంతో అత్యవసర సేవలందించేందుకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఈఎంటీ వెంపటి ప్రతాప్‌ను అడిగి తెలుసుకున్నారు. వాహనాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు వెంట దుకాణాల తొలగింపు

మిర్యాలగూడ, మార్చి 6: కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి-167 నిర్మాణంలో భాగంగా పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు గురువారం మున్సిపల్, జాతీయ రహదారి అధికారులు గురువారం చేపట్టారు. ఇందులో భాగంగా రోడ్డు వెంట ఉన్న పలు దుకాణాలను పోలీసు బందోబస్తు మధ్య తొలగించే పనులు ప్రారంభించారు. డివైడర్ నుంచి ఇరువైపులా 50 అడుగుల మేరా దుకాణాలకు మార్కింగ్ వేశారు. ఆ మేరకు దుకాణాల యజమానులే తొలగించుకోవాలని, లేకుంటే తామే తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు.

వరిలో సస్యరక్షణ చేపట్టాలి

కేతేపల్లి, మార్చి 6 : వరిపై ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ బి.పురుశోత్తం సూచించారు. గురువారం మండలంలోని కొత్తపేట గ్రామంలో తెగుళ్లు సోకిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. వరిలో కాండంకుళ్లు తెగులు, అగ్గితెగులు తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. కాండం కుళ్లు తెగులు నివారణకు వాలిడామైసిన్ లేదా హెక్సాకొనజోల్ లీటరు నీటికి 2 ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని, అగ్గి తెగులు నివారణకు 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్‌ను లీటరు నీటికి కలిపి పైరుపైరీ చేయాలని సూచించారు.

పాఠశాల విద్యార్థులకు యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం

- డీఈఓ భిక్షపతి

నల్లగొండ, మార్చి 6: పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి బాల శాస్త్రవేత్తలుగా తయారు చేసేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఆధ్వర్యంలో యంగ్ సైంటిస్ట్-2025 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈఓ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు అంతరిక్ష సాంకేతికత, అంతరిక్ష శాస్త్ర అనువర్తనాలపై ప్రాథమిక జ్ఞానం అందించటమే ఈ కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి మార్చి-23వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను https:||jigysa.gov.in వెబ్‌సైట్లో సమర్పించాలని సూచించారు. ఈ ఏడాది జనవరి-1 నాటికి 9వ తరగతి చదువుతున్న వారు అర్హులని తెలిపారు. గత సంవత్సరం ఎనిమిదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా 50 శాతం, ఆన్‌లైన్ క్విజ్ ప్రతిభకు 10 శాతం, సైన్స్ మేళాలో పాల్గొన్న వారికి 10శాతం, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్‌లో భాగస్వాములైన వారికి 5 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న వారికి 15 శాతం అదనంగా అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని, సెల్ 9848378845కు సంప్రదించాలని కోరారు.

పాడి రైతులకు రుణాల పంపిణీ

రైతులకు రుణాలు అందిస్తున్న అధికారులు

చిట్యాల, మార్చి 6 : కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా 26 మంది పాడి రైతులకు మంజూరైన రూ.22 లక్షల రుణాలను గురువారం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ వంశీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే మొదటి సారిగా చిట్యాలలో కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు మంజూ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ జీవీ రమేశ్, సహాయ సంచాలకుడు డాక్టర్ సయ్యద్ ముస్తాక్ ఖాద్రి, ఎస్‌బీఐ మేనేజర్ వరప్రసాద్, చిట్యాల, ఉరుమడ్ల పశువైద్యాధికారులు వి.అభినవ్, అమరేందర్, పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ కర్నాటి చెన్నారెడ్డి పాల్గొన్నారు

పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలి

- సంఘం మండలాధ్యక్షుడు కోట రఘునందన్

మర్రిగూడ(నాంపల్లి), మార్చి 6 : హైదరాబాద్‌లో ఈ నెల 9న నిర్వహించే పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలని సంఘం మండలాధ్యక్షుడు కోట రఘునందన్ కోరారు. గురువారం మండలకేంద్రంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు చేతినిండా పనిలేక అర్థాకలితో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు గోలి కృష్ణ, సంగం గణేశ్, గుర్రం శ్రీరాములు, భరతయ్య, వెంకటేశ్వర్లు, పాపయ్య, విజయ్, అనిల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కనగల్‌లో యూనియన్ బ్యాంక్ ప్రారంభం

నల్లగొండ సిటీ : కనగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గురువారం కనగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ కారే భాస్కరరావు, తాసీల్దార్ పద్మ, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఏ మురళీకృష్ణ, చీఫ్ మేనేజర్ రాజేశ్వరి, రాజేశ్, రఘురాం, బీఆర్ఎం కోటేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ మోహన్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం

- రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ రూరల్, మార్చి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి బోనస్ ఇవ్వకుండా రైతులను ఇబ్బందుల పాలు చేస్తున్నదని రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో సంఘం సభ్యత్వ నమోదును చేపట్టారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుపై పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, పద్మావతి, గురవయ్య, పెద్దులు, శ్రీనివాస్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండ వాసికి ఓయూ డాక్టరేట్

పీహెచ్‌డీ అందుకుంటున్న శ్రీనిఖిల

నీలగిరి, మార్చి6: ఓయూ కామర్స్ విభాగంలో నల్లగొండకు చెందిన కందిబండ శ్రీనిఖిలకు డాక్టరేట్ లభించింది. కోఠిలోని చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో పార్ట్ టైం అధ్యాపకురాలిగా పనిచేస్తున్న శ్రీనిఖిల అదే విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నజియా సుల్తానా పర్యవేక్షణలో 'పంటలు, పశువుల బీమాకు సంబంధించి ఎంపిక చేసిన బీమా కంపెనీల మార్కెటింగ్ పద్ధతులపై రైతుల దృక్పథం' అంశంపై చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ ఆమెకు పీహెచ్‌డీ పట్టాను అందించింది.

'అసంపూర్తి పనులతో ప్రజల ఇబ్బందులు'

చౌటుప్పల్, మార్చి 6 : చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఎదుట అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ గుంతను గురువారం బీజేపీ నాయకులు సందర్శించారు. అసంపూర్తిగా పనులు నిలువడంతో గుంత ప్రమాదకరంగా మారిందని వారు మండిపడ్డారు. అక్కడనుంచి ప్రజలు వెళ్లాలంటే జంకుతున్నారని అన్నారు. మురుగు సర్వీస్ రోడ్డు వెంట ప్రవహించడంతో దుర్వాసన వస్తుందని తెలిపారు. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్పారు. మున్సిపల్ కమిషనర్‌కు అనేక సార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలానే కొనసాగితే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దూడల భిక్షం గౌడ్, రమనగోని శంకర్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, పోలోజు శ్రీధర్ బాబు, కడారి కల్పన, కైరంకొండ అశోక్, బత్తుల జంగయ్య గౌడ్, రిక్కల సుధాకర్ రెడ్డి, ముత్యాల భూపాల్‌రెడ్డి, ఊడుగు వెంకటేశం గౌడ్ తదితరులు

ఎల్ఆర్ఎస్‌పై రాయితీ

తిరుమలగిరి, మార్చి 6: గతంలో ఎల్ఆర్ఎస్ పథకం కింద రూ.1,000 చెల్లించిన వారు 25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేయించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్ యాదగిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం మార్చి 31 వరకు ఉంటుందని, మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాగ్స్ షెల్టర్ గదులను ప్రారంభించిన ఎస్పీ

గదులను ప్రారంభిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్, మార్చి 6: జిల్లా పోలీస్ శాఖకు కొత్తగా ట్రాక్టర్ లూసీ, ఎక్స్‌ప్లోజివ్ బ్రూనో అనే రెండు డాగ్స్(జాగిలాలు)ను కేటాయించగా, వాటి కోసం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్మించిన షెల్టర్ గదులను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో కేసుల ఛేదనలో డాగ్స్‌కు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. చాలా కేసుల్లో నేరస్థులను పసిగట్టడంలో సమర్థవంతంగా పనిచేశాయని గుర్తు చేశారు. లూసీ ఘటనా స్థలంలో లభించే ఆధారాలతో నేరస్తులను గుర్తిస్తుందని, బ్రూనో పేలుడు సామాగ్రిని గుర్తిస్తుందని తెలిపారు. అదనపు ఎస్పీలు నాగేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, ఆర్ఐలు నారాయణరాజు, నరసింహ, డాగ్ స్క్వాడ్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఆర్ఎస్ఐలు సురేశ్, కె.అశోక్, ఎం.అశోక్, రెహమాన్, మహేశ్ పాల్గొన్నారు.

కాళేశ్వరం జలాలు అందించాలని కాల్వలో దిగి నిరసన

కాల్వలో దిగి నిరసన తెలుపుతున్న రైతులు

తుంగతుర్తి, మార్చి 6: ఎస్సారెస్పీ కాల్వల ద్వారా కాళేశ్వరం జలాలను అందజేసి తమ పంటలను కాపాడాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎస్సారెస్పీ కాల్వలోకి దిగి పలువురు రైతులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు పంటలకు పుష్కలంగా నీళ్లు వచ్చాయని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో నీటి కరువును చూస్తున్నామని వాపోయారు. సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదని, ఆత్మహత్య తప్ప మరో దారి కనిపించడం లేదని అన్నారు. లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని, ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి మిగిలిన పంటలకైనా నీరు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో రైతులు వీరబోయిన నాగయ్య, గుజ్జ చందర్ రావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

'ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలి'

కూలీలతో మాట్లాడుతున్న పీడీ అప్పారావు

నడిగూడెం, మార్చి 6: మండల పరిధిలోని కేశవాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పారావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. చేసిన పనికి వేతనం అందుతుందా.. లేదా అని, పని ప్రదేశంలో మౌలిక వసతులు అందుతున్నాయా అని ఆరాదీశారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి సంజీవయ్య, ఈసీ శ్రీను, ఉపాధి హామీ సిబ్బంది విజయ్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి అన్వర్, ఫీల్డ్ అసిస్టెంట్ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి : సీపీఎం

సూర్యాపేట టౌన్, మార్చి 6: దోమల బారి నుంచి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని సీపీఎం సూర్యాపేట వన్‌టౌన్ కార్యదర్శి వి.సాయికుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం సీపీఎం వన్‌టౌన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. సూర్యాపేట పట్టణంలో ప్రత్యేకాధికారుల పాలనలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. మురికి కాల్వల్లో చెత్త పేరుకుపోయిందని, దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారినపడుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే అన్ని వార్డుల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు మామిడి పుల్లయ్య, అర్వపల్లి లింగయ్య, ఒట్టె ఎర్రయ్య, బుద్ద సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ

తిరుమలగిరి, మార్చి 6: తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మండల కేంద్రానికి చెందిన ఎల్సోజు చామంతి గురువారం ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో మార్కెట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి శిబిరం

పాలకవీడు, మార్చి 6: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో గురువారం క్షయ వ్యాధి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి పి.నాగిని మాట్లాడుతూ.. గ్రామంలో క్షయ వ్యాధితో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించామని, 121 మందికి పైగా పరీక్షలు నిర్వహించామని వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి శ్రీనివాస్, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర్లు, ధనమ్మ, మమత, వైద్య సిబ్బంది కిరణ్ దివ్య, రమ్య, రచన, నాగేంద్ర పాల్గొన్నారు.

'అనురాగ్'లో టాలెంట్ హంట్

అనంతగిరి, మార్చి 6: మండల పరిధిలోని అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో క్లిక్ టాక్స్ సంస్థ సహకారంతో గురువారం క్రియేటివ్ కార్నివాల్ టాలెంట్ హంట్ నిర్వహించారు. మాదక ద్రవ్యాలు, పర్యావరణ కాలుష్యం, డ్రగ్స్, బాల కార్మిక వ్యవస్థ నియంత్రణకు, మహిళల రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై విద్యార్థులు నాటకాలను ప్రదర్శించి అలరించారు. ఈ సందర్భంగా క్లిక్ టాక్స్ సంస్థ మేనేజర్ ఆర్య మాట్లాడుతూ.. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సురేశ్‌కుమార్, కళాశాల టీపీఓ విద్యాసాగర్, యాజమాన్యం, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు నూతన నాయకత్వం : ఏపీఎం

అనంతగిరి, మార్చి 6: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలతో ఏపీఎం లక్ష్మి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని డ్వాక్రా సంఘాలకు ఈ నెల 25వ తేదీలోపు నూతన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఆదేశించారు. నూతన నాయకత్వంపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వీఓఏలపైనే ఉందన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

మునగాల, మార్చి 6: మండల కేంద్రంలోని సాయిగాయత్రి పాఠశాలలో గురువారం కోదాడ అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, ఉష, వెంకన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సాయం

నేరేడుచర్ల, మార్చి 6: పెంచికల్‌దిన్నె ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి నిమ్మల పాండు రంగయ్య తన సతీమణి ఝాన్సీలక్ష్మి జ్ఞాపకార్థం గురువారం రూ. 10 వేలు సాయంగా అందజేశారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రాఘవరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్‌రావు, యాదయ్య, అనిల్‌కుమార్, ఏసుపాదం, లింగయ్య పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: దోసపహాడ్ ప్రాథమిక పాఠశాలకు సూర్యాపేటకు చెందిన కరాటే మాస్టర్ సయ్యద్ రియాజుద్దీన్ గురువారం రూ.3 వేలు అందజేశారు. హెచ్ఎం నర్సయ్య, మామిడి వెంకన్న, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, వెంకన్న, విప్లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సూర్యాపేట టౌన్, మార్చి 6: జిల్లా కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (జీపీఎస్ కొత్తగూడెం బజార్)లో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయుల వేషధారణల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి అలరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి, ఉపాధ్యాయులు నాయిని మమత, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.